ప్రజాశక్తి

శనివారం 10 మే 2025 5 విజయనగరం



సబ్‌జైలులో డిఎల్‌ఎస్‌ఎ కార్యదర్శి తనిఖీ

ప్రజాశక్తి-చీపురుపల్లి

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ శుక్రవారం చీపురుపల్లి సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించారు. వీటిలో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు. పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు. జైలులో ఉన్న ముద్దాయిలకు సకాలంలో న్యాయ సహాయం అందించేందుకు జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామని, వాటిని సక్రమంగా కొనసాగించాలని తెలిపారు. రిమాండ్‌లో ఉన్న నిందితులకు న్యాయవాదులు లేకపోతే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ న్యాయ సహాయ న్యాయవాదిని అందిస్తుందని తెలిపారు. జైలులో అమలవుతున్న సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు.



మారిక కొండ ప్రాంతం

ముగ్ధ మనోహరం.. మారిక కొండ ప్రాంతం

పర్యాటకాభివృద్ధికి విస్తృత అవకాశాలు ● అదానీకి కట్టబెట్టేందుకు సర్కారు అత్యుత్సాహం

ఓవైపు ఎత్తయిన కొండలు.. మరోవైపు పాతాళాన్ని తలపించే లోయలు... మెలికలు తిరిగే రహదారి.. అరకు ప్రయాణాన్ని తలపించే ఘాట్ రోడ్డు.. రహదారి పొడవునా దట్టమైన అటవీ ప్రాంతం, రా...! రమ్మంటున్నట్టుగా తొనికిసలాడే పచ్చదనం.. దారి పొడవునా పక్షుల కిలకిల రావాలు. అబ్బబ్బా... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ప్రత్యేకతలు... ఎంతో ఆహ్లాదకరమైన ముగ్ధ మనోహర దృశ్యాలు. మాటల్లో చెప్పలేని అనుభూతి. అపరకుబేరుడు అదానీ కన్ను పడేవరకు పాలకులుగానీ, అధికార యంత్రాంగం గానీ అటువైపు కన్నెత్తి కూడా చూడని ప్రాంతం మరెక్కడో కాదు సుమా.! విజయనగరం జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్లు, విశాఖ నగరానికి 40కిలో మీటర్లదూరంలోవున్న వేపాడ ఏజెన్సీ ప్రాంతం. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని వశపర్చుకునేందుకు అదానీ పావులు కదుపుతుండడం, ఆయన సేవలో ప్రభుత్వ యంత్రాంగం తరించిపోవడంతో ఈ ప్రాంతం ఉనికిలోకి వచ్చింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, వేపాడ

వేపాడ మండలం కరకవలస పంచాయతీ పరిధిలోని పాత మారిక, కొత్తమారికతోపాటు అదే పేరుతో మరో రెండు గిరిజన ఆదివాసీ గ్రామాలు ఎత్తయిన గిరిశిఖరాలపై ఉన్నాయి. ఈ గిరిజన గూడేల్లో కొండదొరలు, పిటిజిలు సహా పలు గిరిజన తెగలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. కొన్ని దశాబ్దాలకు ముందుకు వెళ్తే... ఇక్కడి గిరిజనులకు అడవి తప్ప వేరే ప్రపంచమే తెలియదంటే అతిశయోక్తి కాదు. అడవిలో సంప్రదాయ వేట. అక్కడ దొరికే దుంపలు, పండ్లు, కాయలు, ఆకులు అలములే వీరికి ఆహారంగా ఉండేది. ఇలా అడవి తల్లితో విడదీయలేని సంబంధం గల ఈ గిరిజన జాతులు రెండు దశాబ్దాలుగా మారిన పరిస్థితులకు అనుగుణంగా కాయ కష్టం చేసి వరి, ఊదలు, అరెకెలు తదితర తిండి గింజలు, టమాట సహా పలు కాయగూరలు కూడా సాగు చేసుకుంటున్నారు. ఇలా వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో నూనె, ఉప్పు వంటి కొన్ని రకాల సరుకులు కొనుగోలు చేసుకుంటూ కాలానికి అనుగుణంగా తమ ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు.

చెప్పలేని అనుభూతి

ఒకప్పుడు కాలినడకకు కూడా ఇబ్బందిగా ఉండే మారిక మార్గం నేడు చెప్పలేని అనుభూతులునిచ్చే విధంగా కనిపిస్తోంది. ఇక్కడికి చేరుకోవాలంటే పంచాయతీ కేంద్రం నుంచి సుమారు 10కిలోమీటర్ల మేర నాలుగు కొండలు, మధ్య మధ్యలో చిన్నచిన్న గుట్టలు ఎక్కాల్సిందే. రెండేళ్ల ముందుకు వెళ్తే... మైదాన ప్రాంతానికి చేరుకోవాలంటే కొండలపై నుంచి తుప్పలు, డొంకలు దాటుకుంటూ, ముళ్ల పొదలను తప్పించుకుంటూ అతికష్టం మీద నడక సాగించాల్సివచ్చేది. సిపిఎం సుదీర్ఘ పోరాట ఫలితంగా రూ.7కోట్లతో మంజూరైన రోడ్డు వాహనాల రాకపోకలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే 40శాతం నిర్మాణ పనులు జరిగాయి. ఇప్పుడిప్పుడే గిరిజన యువత మోటార్ సైకిళ్లతో అతికష్టం మీద ప్రయాణాలు సాగిస్తున్నారు. పనులు పూర్తయితే మెలికలు తిరిగిన అరకు ఘాట్ రోడ్డును తలపిస్తుంది. దారి మొత్తం అరణ్యాన్ని తలపిస్తుంది. ఎక్కడికక్కడ వ్యూపాయింట్లకు అనువుగా ఉంటోంది. అక్కడి నుంచి చూస్తే కిందవున్న గ్రామాలు నక్షత్రాల్లా కనిపిస్తున్నాయి. కొండవాలు ప్రాంతాలన్నీ పెద్దపెద్ద లోయలు. అందులో పారేసెలయేళ్ల మాదిరి కనిపిస్తున్న జీవగెడ్డలు తారసర పడుతుంటాయి. ప్రయాణం సాగిస్తున్న కొద్దీ ముందుకే సాగాలన్నట్టుగా అనిపిస్తుంది. సాయంత్రం అయితే చాలు మేఘాలు చల్లబడి మన్యంపై మంచుదుప్పటి కమ్మేసినట్టుగా కనిపిస్తోంది. అబ్బబ్బా అక్కడి అనుభూతులే వేరు. తీరా అక్కడికి వెళ్లాక అరకు, పాడేరు మాదిరిగా కొంత భాగం ఎక్కడా ఎగుడూ దిగుడూ లేకుండా నేలంతా సమాంతరంగా కనిపిస్తోంది. పక్షుల కిలకిలరావాలు తప్ప అంతా నిశ్శబ్దవాతావరణం. మరోవైపు ఊటగెడ్డల నుంచి జాలువారే నీటితో వివిధ పంటలు పచ్చదనంతో తొనికిసలాడుతున్నాయి. గిరిజన ఆదివాసీలు వేట కొడవల్లు, విల్లంబులతో తారసపడతారు. వాతావరణం కూడా ఎంతో చల్లగా ఉంటోంది. ఈనేపథ్యంలో మారిక కొండ ప్రాంతానికి రోడ్డు మార్గం పూర్తిచేయడంతోపాటు కొన్ని సదుపాయాలు కల్పిస్తే అబ్బురపర్చే పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది. సినిమా షూటింగ్స్‌కి సైతం తీసిపోదంటే అతిశయోక్తి కాదు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ప్రాంతంపై దేశంలోని అపరకుబేరుడు అదానీ కళ్లు పడ్డాయి. ఓపెన్ లూప్ పంప్ స్టోరేజీ పవర్ ప్లాంట్ పేరిట అడిగిందే తడువుగా ఈ ప్రాంతాన్ని కట్టబెట్టేందుకు ప్రభుత్వం అమితమైన ఉత్సాహం చూపుతోంది.



ఆహ్లాదాన్ని పంచే పచ్చని చెట్లు



కొండపైకి వె ళ్లేందుకు నిర్మిస్తున్న రహదారి

ముమ్మరంగా పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణంతో దేశ సరిహద్దుల్లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ ఆకస్మిక తనిఖీలను ముమ్మరం చేశారు. ముఖ్యమైన ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, రైల్వే స్టేషన్లు, బస్టాండులు, లాడ్జీలు, హోటళ్లు, వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లోను, ముఖ్య కూడళ్ళలోను ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టామన్నారు. అనుమానస్పద వ్యక్తులు, ఇతర దేశాల నుండి జిల్లాకు విచ్చేసి, మకాం వేసిన విదేశీ వ్యక్తుల ఆచూకీ కనుగొనేందుకు ఆకస్మికంగా లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలను ముమ్మరం చేసి, అనుమానస్పద వ్యక్తుల వేలిముద్రలను చెక్ చేసి, వారి గుర్తింపు కార్డులను పరిశీలించారన్నారు. వివిధ ప్రాంతాల్లో ఆకస్మికంగా 1088 వాహనాలను తనిఖీ చేసి, వాహనాల రికార్డులను పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పది వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమానస్పద వ్యక్తులు, షిప్పుల సమాచారాన్ని స్థానిక పోలీసులకు లేదా మెరైన్ పోలీసులకు అందించాలని మత్స్యకారులను కోరారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీలను విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, తనిఖీల్లో సంబంధిత సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ఎస్టీఎఫ్ సిబ్బంది, మెరైన్ పోలీసులు, డాగ్, బాంబ్ స్క్వాడ్స్, డ్రోన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సూట్‌కేసులను తనిఖీ చేస్తున్న పోలీసులు

12న విద్యాశాఖ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణ, బదిలీలకు సంబంధించి సమస్యలు వెంటనే పరిష్కరించి బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ఈమేరకు డిఇఒ మాణిక్యంనాయుడుకు వినతి అందజేశారు. 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని, ప్రతి మోడల్ ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాలని, ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల సహాయకులను నియమించాలని, ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియంలను కొనసాగించాలనీ, బదిలీలలో సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమేష్ చంద్ర పట్నాయక్, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాద్, సిహెచ్ తిరుపతి నాయుడు, పి.రాంప్రసాద్, బి.శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

మినుములు కొనుగోలు ప్రారంభం

ప్రజాశక్తి - జామి

ప్రభుత్వం ఎట్టకేలకు అపరాల పంటలైన మినిములను కొనుగోలు చేసింది. రైతు సంఘం పోరాటం ఫలితంగా మండలంలోని విజినిగిరి గ్రామానికి చెందిన కాలింపుడి రామునాయుడు అనే రైతు నుంచి 18 క్వింటాలు, కసిరెడ్డి నారాయణరావు నుంచి 7 క్వింటాలు, గొర్లి గంగాభవాని నుంచి 6 క్వింటాలు ఎన్‌సిసిఎఫ్ బృందాలు కొనుగోలు చేసాయి. వాస్తవానికి మినుములు పంటకు క్వింటాకు రూ. 7400 ప్రభుత్వం మద్దతు దర ప్రకటించింది. కానీ అధికారులు కొనుగోలు కేంద్రాలు పెట్టి కొనుగోలు చేయకపోవడంతో ప్రైయివేటు వ్యాపారులు కేవలం క్వింటాకు రూ. 5800 ఇచ్చి, పంటను తరలించుకు పోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఎపి రైతు సంఘం ఆందోళనతో అధికారులు మినుములు కొనుగోలు ప్రారంభించారు.



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ఆర్‌డి రవీంద్ర, కమిషనర్ నల్లనయ్య

అన్న క్యాంటీన్లను పరిశీలించిన ఆర్‌డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ల ఔన్నత్యాన్ని మరింతగా పెంచాలని సిబ్బందికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర సూచించారు. శుక్రవారం గోషాసుపత్రిలో ఉన్న అన్నాక్యాంటీన్‌ను కమిషనర్ పల్లి నల్లనయ్యతో కలిసి పరిశీలించారు. అక్కడ సరైన షెడ్డు లేకపోవడంతో అన్నార్తులు ఎండలోనే ఉండడాన్ని గమనించి తక్షణమే షడ్ నిర్మాణానికి చొరవ చూపాలని అధికారులు ఆదేశించారు. కమిషనర్ పల్లి నల్లనయ్య స్పందిస్తూ ఇప్పటికే షెడ్ నిర్మాణానికి అవసరమైన టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే షెడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎఇ సూరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో నగరాభివృద్ధికి కృషి చేయాలి

అన్ని శాఖల సమన్వయంతో నగరపాలక సంస్థ మరింత అభివృద్ధి చెందే దిశగా కృషి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకున్న ఆయన వివిధ విభాగాల అధిపతులతో, సిబ్బందితో వేరువేరుగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. విభాగాల వారీగా ప్రగతి నివేదికలను పరిశీలించి, వాటి ఆధారంగా పలు సూచనలు సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గానికొక ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-నెల్లిమర్ల/కొత్తవలస

ప్రతీ నియోజకవర్గంలో ఒక ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, ఒక ఎంఎస్ఎంఇ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. రాష్ట్రంలో మొట్టమొదటి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు నెల్లిమర్ల మండలం సారిపల్లి వద్ద శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన ఫ్లాటెడ్ కాంప్లెక్స్ వద్ద పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గుతుందని, దీనివల్ల తక్కువ పెట్టుబడితోనే చిన్నచిన్న పరిశ్రమలను స్థాపించుకొనే అవకాశం కలుగుతుందని చెప్పారు. కేవలం ముద్ర రుణాలు రూ.20 లక్షలతోనే పరిశ్రమను పెట్టుకోవచ్చునని సూచించారు. సుమారు 900 చదరపు అడుగుల స్థలాన్ని నామమాత్రపు ధరకే లీజుకు ఇస్తామన్నారు. మూడు ఎకరాల స్థలంలో రూ.15.55కోట్లతో జిప్లస్2 విధానంలో నిర్మించనున్న ఈ కాంప్లెక్స్ ద్వారా 200 మందికి ప్రత్యక్షంగా, మరో 50మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన నెల్లిమర్ల ఎంఎల్ఎ లోకం నాగమాధవి మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు, త్వరలో యువతకు పారిశ్రామిక వర్క్‌షాప్‌ను నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్క్, కూరగాయాలు తదితర వ్యవసాయ ఉత్పత్తులు, పళ్ల చేపలు, మాసం ఉత్పత్తుల పార్కలను ఏర్పాటు చేసి ఎగుమతి చేసుకొనే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా కృషి చేయాలని కోరారు.

రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ శివశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను యువత వినియోగించుకోవాలని కోరారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి యూనిట్లను స్థాపించేందుకు అనువుగా వారికి శిక్షణ ఇచ్చి, ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, నెల్లిమర్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ ఛైర్మన్ ఎస్.రామారావు, డెంకాడ ఎంపిపి బి.వాసుదేవరావు, ఆర్‌డి కీర్తి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీమోహన్, పరిశ్రమల కేంద్రం ఎడి రామకష్ణ, తాహశీల్దార్ సుదర్శనరావు, మున్సిపల్ కమిషనర్ తారకనాథ్, ఇతర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. భారత్ సరిహద్దుల్లో పాకిస్తాన్ సైనికుల కాల్పులు కారణంగా మృతి చెందిన సత్యసాయి జిల్లాకు చెందిన అమర జవాన్ మురళీ నాయక్‌కు ఈ సందర్భంగా నివాళులర్పించారు.

బలిఘట్టంలో ఎంఎస్ఎంఇ పార్కుకు శంకుస్థాపన

కొత్తవలస : ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.జిల్లాకు మొదటివిడతలో మంజూరైన నాలుగు పార్కుల్లో, మొట్టమొదటి పార్కుకు బలిఘట్టంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. సుమారు 57 ఎకరాల విస్తీర్ణంలో, దాదాపు రూ.7కోట్ల వ్యయంతో ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించేవారికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. జిల్లాకు మొదటి దశలోనే ఎస్.కోట, గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో పార్కులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యువత, మహిళా సంఘాలు పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు రావాలని కోరారు. బలిఘట్టంలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కులో సుమారు రూ.96 కోట్ల పెట్టుబడితో 76 చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని, 1500 మందికి ప్రత్యక్షంగా, 500 మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని చెప్పారు. ఎస్.కోట ఎంఎల్ఎ కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, సర్పంచ్ ఎం.ఎర్రయ్య రామస్వామి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీమోహన్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జిఎం శ్రీధర్, సహాయ సంచాలకులు బి.రామకష్ణ, ఆర్‌డిఓ కీర్తి, తాహసీల్దార్ నీలకంఠేశ్వర్రావు పాల్గొన్నారు.



బలిఘట్టంలో ఎంఎస్ఎంఇ పార్కును ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే



నెల్లిమర్ల : సారిపల్లి వద్ద సభలో మాట్లాడుతున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ సమస్యలపై ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. అన్ని గ్రామాల్లో మోడల్ ప్రైమరీ లేదా బేసిక్ ప్రైమరీ పాఠశాల నిర్వహించాలని, ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక పాఠశాలను అనుసంధానించాలని, జీవో నెంబర్ 55 ప్రకారం యుపి స్కూళ్లలో 6 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశారు. అన్ని ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యాతో నిమిత్తం లేకుండా హెచ్ఎం, పోస్టులు మంజూరు చేయాలని, ఉన్నత పాఠశాలలో 45 మంది విద్యార్థులు దాటిన ఎడల రెండవ సెక్షన్ మంజూరు చేయాలని కోరారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో నూతన పాఠశాలను ఏర్పాటు చేయాలని, వెంటనే 12 పిఆర్‌సి కమిషన్ నియమించాలని, పెండింగ్ డిఎలను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్, రాష్ట్ర అకడమిక్ కౌన్సిల్ జెసి రాజు, గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు, రాష్ట్ర కౌన్సిల్ కర్రి రవి, జిల్లా కార్యదర్శి కె.సింహాచలం, జోనల్ కన్వీనర్ సివిఎల్ఎస్‌కె శర్మ, మజ్జి రమేష్, టి.శ్రీనివాసరావు, ఆర్.శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం

20న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- శృంగవరపు కోట

కార్మిక చట్టాల సాధనకై 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం అంగన్వాడీ, ఆశా, మీడ్డే మిల్స్, స్కూల్ శానిటేషన్ వర్కర్స్, పారిశుధ్య కార్మికులు, ఆటో తదితర రంగాల కార్మికులతో సదస్సు నిర్వహించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు అధ్యక్షత వహించిన సదస్సులో సురేష్, కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రంలో 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని అన్నారు. దీంతో కార్మికులు సంఘంపెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును, 8 గంటల పని దినాన్ని కోల్పోతారని తెలిపారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో సిడిపిఒ ఉమాకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సభ్యులు విజయ, పారిశుధ్య కార్మికుల సంఘం నాయకుడు ఎం.దేవా, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు వి.అచ్చియ్యమ్మ, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమ్మె నోటీసు

గజపతినగరం : లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరుగనున్న సమ్మెలో పాల్గొంటామని పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు పురిటిపెంట పంచాయతీ కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒ పుష్పలతకు, గజపతినగరం సచివాలయ సిబ్బందికి సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, నాయకులు బి కనకరాజు, కోటేశ్వరరావు, బి గోవింద, పి.కృష్ణ, కె.రాము, బి అప్పలస్వామి, గణేషు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు

. నెల్లిమర్ల : మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాట్యూటీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న సమ్మెలో పాల్గొంటున్నామని నెల్లిమర్ల కమిషనర్‌కు సమ్మె నోటీ అందజేశారు. ఈ డిమాండ్లపై దేశవ్యాప్త పిలుపులో భాగంగా మే 20న సమ్మె, స్థానిక సమస్యలపై 21, 22 తేదీల్లో సమ్మె చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ వర్కర్స్‌అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఎ. జగన్మోహన్‌రావు, యూనియన్ నాయకులు బాబురావు, రాము ,దుర్గారావు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : ఎంపిడిఒ కార్యాలయ ఎఒకు వినతినిస్తున్న సిఐటియు నాయకులు



మోసాలకు పాల్పడితే ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తూనికలు, కొలతల్లో మోసాలు జరిగితే వెంటనే వినియోగదారులు లీగల్ మెట్రాలజీ అధికారులను సంప్రదించాలని లీగల్ మెట్రాలజీ సహాయ నియంత్రణ అధికారి పివి రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. మే 20న జరిగే ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన కార్యక్రమాల్ని చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలో శుక్రవారం రిలయన్స్ స్మార్ట్ బజార్ లో వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ తూనికలు, కొలతలలో జరిగే మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈనెల 8న ఆర్‌అండ్‌బి రైతుబజార్‌లో ధర్మ కాటా ఏర్పాటు చేసి వినియోగదారులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. రిలయన్స్ స్మార్ట్ బజారులో ప్యాకేజీ పై పేర్కొనాల్సిన వివరములు గురించి సిబ్బందికి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి రైతు బజార్ ఎస్టేట్ అధికారి అప్పలనాయుడు, లీగల్ మెట్రాలజీ సిబ్బంది,వినియోగదారులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులను హెల్త్ ప్రొవైడర్లుగా గుర్తించండి

ప్రజాశక్తి-విజయనగరంకోట

గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చిన హెల్త్ ప్రొవైడర్లగా గుర్తించాలని స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మికి ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ఫెడరేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పేరి రామయ్య పంతులు వినతి అందజేశారు. ఎమ్మెల్యే పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన తమ సమస్యలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60 వేల మంది గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇచ్చే విధంగా గతంలో ఏర్పాటు చేసిన 465 జీవోను పునరుద్ధరణ చేసి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. వినతినిచ్చిన వారిలో అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ అప్పలరాజు ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతినిస్తున్న పేరి రామయ్య పంతులు

పౌష్టికాహారంపై శిక్షణ

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని వల్లంపూడి అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికలు తీసుకోవలసిన పౌష్టికాహారంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. కిషోర బాలికలందరూ పండ్లు, పాలు, కూరగాయలు, ఆకు కూరలు తినాలని రక్తహీనత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రతను పాటించాలని, వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వేపాడ, ఎన్‌కెఆర్ పురం, బొద్దాం సెక్టార్‌లలో నిర్వహించామని అంగన్‌వాడీ సూపర్ వైజర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సమగ్ర భూ సర్వే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవలో గత కొన్ని రోజులుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర భూ సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. గ్రామాలలో రైతులు చురుగ్గా పాల్గొని రెవెన్యూ సిబ్బందికి సహకరిస్తున్నారు. సమగ్ర భూ సర్వేలో గ్రామ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ సర్వేయర్, మండల సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకం

ప్రజాశక్తి- డెంకాడ

రాబోయే సవాళ్లకు ధీటుగా ఆర్టిఫిషిఎల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగించి ఈ డిజిటల్ యుగంలో భాసాభ్యాసం జరగడం కీలకమని నీట్ వరంగల్ ప్రొఫెసర్ స్ఫూర్తి అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజనీరింగ్ కళాశాలలో ఆంగ్ల ప్రయోగశాల వేదికగా వరంగల్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నీట్ సహకారంతో శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ స్ఫూర్తి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టులో భాగంగా ఒకటైన ఈ కార్యశాల సాంకేతిక సాధనాలతో విద్యార్థులు పరస్పర ఆలోచనలను గమనించడానికి, విశ్లేషించడానికి అణువైన వేదికగా ఉండటం లెండి ఇంజనీరింగ్ కళాశాలను ఎంచుకున్నామన్నారు. విద్యార్థులు తమ భాసాభ్యాస ప్రయాణంలో వారి రియల్ టైం ఇంజనీరింగ్ విద్యలో సాధనాలు ఇంటర్నెట్, ఇతర డిజిటల్ వనరులను ఉపయోగించడంలో వారి ప్రభావాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడతాదన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రాజెక్ట్ అసోసియేట్ అమృత, శ్రావణి, రాణి, రేవతి, రాజా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలందరూ మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (బాలికల జూనియర్ కళాశాల) ఇంటర్మీడియట్‌లో చేరాలని హైస్కూల్ హెచ్‌ఎం బి.ఉమామహేశ్వరరావు, పిజిటి అధ్యాపకులు రహింషేక్ లాల్, ఎస్‌విఎస్‌ఎన్ మూర్తి (సతీష్ మాస్టర్) శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో ఎంపిసి, బైపిసి కోర్సులలో కేవలం బాలికల కోసం మాత్రమే కళాశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీతారాంపురం, గోపాలపల్లి, ధర్మవరం సన్యాసయ్యపాలెం తదితర గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బాలికల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకైక బాలికల కళాశాల ఇదేనని, అందువల్ల పదో తరగతి ఉత్తీర్ణులైన అమ్మాయిలు ఇదే కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌కెఆర్ పురంలో అన్నదానం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠరాజపురంలో నూతనంగా నిర్మించిన తుడుపులమ్మ అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడువ రోజు విగ్రహ ప్రతిష్ఠ బింబదర్శనం, కుంభ దర్శనం, అమ్మవారి విశేషాలంకరణతో భక్తులకు దర్శనం చేసుకున్నారు.

ప్రత్యేక తరగతులు పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫెయిల్ అయిన పిల్లలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను శుక్రవారం ఎంఇఒ ఎన్ నాగభూషణరావు పరిశీలించారు. విద్యార్థులకు పరీక్షల్లో ఉత్తీర్ణులు అవ్వడానికి పలు సూచనలు ఇచ్చారు.

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం మేజరు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పూర్వ విద్యార్థులంతా కలిసి శనివారం నిత్యవసర వస్తువులు అందజేశారు. భోగాపురం ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1982-83 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఇటీవలి కలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరంతా కలిసి సుమారు 20 మంది పారిశుధ్య కార్మికులకు తమ వంతు సాయాన్ని అందజేశారు. గ్రామ పెద్దలు కొమ్మూరి శుభోషణరావు, ఆళ్ల ఉదయ బాబు, అడప ప్రసాద్, గుండపు సూరిబాబు, రౌతు వాసు చేతుల మీదుగా వీటిని అందజేశారు. పూర్వ విద్యార్థులు రామజెన్ని శ్రీనివాసరావు, కాపుగంటి తాతయ్యలు, ఆచారి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ తక్షణమే అమలు చేయాలి

డిఇఒకు మాదిగ ఉద్యోగుల సమాఖ్య వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ల ప్రకారం, త్వరలో జిల్లా విద్యా శాఖ చేపట్ట బోయ ఉపాధ్యాయ ప్రమోషన్లన్నింటిలోనూ ఎస్‌సి రోస్టర్ విధానాన్ని అమలు చేస్తూ, మాదిగ ఇతర ఉపకులాల ఉపాధ్యాయులకు సమన్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిఇఒ మాణిక్యంనాయుడుకు మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు వినతి అందజేశారు. డిఇఒ సానుకూలంగా స్పందించి, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇప్పటికే జారీ చేసిందనీ, త్వరలో జరగబోయే ప్రమోషన్లలో ఎస్సీ వర్గీకరణ తప్పని సరిగా అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు పెంకి ఇశ్రాయేల్, ప్రధాన కార్య దర్శి యందవ పైడితల్లి, జాతీయ కార్యవర్గ సభ్యులు గర్భాపు వరప్రసాద్, అరసాడ రవికుమార్, జిల్లా నాయకులు డి. ప్రభాకరరావు, ఎ.రాజశేఖర్, అలమండ చంటి, అలజంగి వినయ్, బొబ్బిలి రాజేష్, యందవ జోజిబాబు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అబ్బాకిల్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభంతో మానసిక ఆప్టిట్యూడ్పై ఫ్యాకల్టీ శిక్షణా కార్యక్రమం శుక్రవారం ఘనంగా ముగిసింది. డిఫెన్స్-ఓరియెంటెడ్ లీడర్‌షిప్ ట్రైనింగ్ కోసం సైకలాజికల్ ఆప్టిట్యూడ్ అసెస్మెంట్‌పై 5 రోజుల ఫ్యాకల్టీ శిక్షణా కార్యక్రమం అబ్బాకిల్ ట్రైనింగ్ కేంద్రం ప్రారంభోత్సవంతో విజయవంతంగా ముగిసింది. మే 5 నుండి 9 వరకు జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో వివిధ విభాగాల నుండి 25 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. భారత నావికాదళ సేవల ఎంపిక బోర్డు మాజీ అధ్యక్షుడు, రక్షణ మానసిక అంచనాలు, నాయకత్వ శిక్షణలో అనుభవజ్ఞుడైన నిపుణుడు కమోడోర్ మనోజ్ భూరియా (రిటైర్డ్) నేతృత్వంలో సమగ్ర శిక్షణా నిర్వహించారు. నాయకత్వ అభివృద్ధి, నిర్వహణ సూత్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం అబ్బాకిల్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంవిజిఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోతకు వచ్చిన రాగి పంట

ప్రజాశక్తి - వేపాడ


కోతకు సిద్ధంగా ఉన్న రాగి పంట

మండలంలో కనుమరుగైపోయిన రాగి పంట ఆతవ గ్రామ రెవెన్యూ పరిధిలోగల కసిరెడ్డి వారి వ్యవసాయ భావి మళ్లీ దర్శనమిచ్చింది. ఆ గ్రామానికి చెందిన కసిరెడ్డి కుటుంబ సభ్యులు 40 ఎకరాల్లో రాగి పంట వేశారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు ఉదయం పూట ఒక గ్లాసు అంబలి తాగాలని, అలా తాగితే ఆరోగ్యం బాగా ఉంటుందని వైద్యులు సూచించడంతో ఇప్పుడిప్పుడే రాగులు ఉపయోగం తెలియడంతో రైతులు ఈ పంట పై దృష్టి సారించారు. ఇంత వరకు మారిక, చిట్టివానిపాలెం, బంగారయ్యపేట వంటి 11 గ్రామాల్లో ఈ పంటను పండిస్తున్నారు. రాగులపై గిరాకీ పెరగడంతో అవకాశం ఉన్నచోట ఈ రాగి పంటను రైతులు పండించడానికి ముందుకు వస్తున్నారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. వ్యవసాయ అధికారులు కూడా గ్రామాల్లో రైతులకు రాగి పంట పండించే విధానంపై అవగాహన కల్పిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

రోగులకు తప్పని ఇక్కట్లు

● వరండాలోనే వైద్య సేవలు ● ఇంకా పూర్తికాని సామాజిక ఆసుపత్రి నిర్మాణం ● వినియోగించకుండానే మూలకు చేరిన సామగ్రి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సామాజిక ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమై సంవత్సరాల గడుస్తున్నా ఇంతవరకు పూర్తికాలేదు. 6 సంవత్సరాల క్రితం సామాజిక ఆసుపత్రి అదనపు గదుల నిర్మాణం ప్రారంభమైంది. సంవత్సరాలు గడుస్తున్నా ఆసుపత్రి ఇంతవరకు పూర్తి కాలేదు. అప్పట్లో ప్రభుత్వం 5 కోట్ల రూపాయలు కేటాయించి నిర్మాణ పనులు కాంట్రాక్టరుకు అప్పగించింది. నిధులు విడుదల కాక మధ్యలో కొంతకాలం పనులు నిలిచిపోయాయి. మళ్లీ పనులను ప్రారంభించినా పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో రోగులు నానా తంటాలు పడుతున్నారు.

ఏ ప్రభుత్వం ఉన్నా అదే పరిస్థితి

గత ప్రభుత్వంలో సామాజిక ఆసుపత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం వహించగా ప్రస్తుతం ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్యం చూపించి ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు కేటాయించకపోవడం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. నిర్మాణం పూర్తికాకాక పోవడంతో వైద్య సిబ్బంది, రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా వైద్యం కోసం వస్తున్న రోగులు ఇరుకు గదుల్లో ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.


ఒకే గదిలో చికిత్స పొందుతున్న రోగులు

పెరుగుతున్న ఒపి

నెల్లిమర్ల సామాజిక ఆస్పత్రికి రోగులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతి రోజూ కనీసం 200 నుంచి 300 మంది వరకూ రోగులు వస్తుంటారు. వీరికి గదులు చాలకపోవడంతో ఆసుపత్రి వరండాలో రోగులు నమోదు (ఒపి), తనిఖీలు చేస్తున్నారు. గదుల సౌకర్యం చాలక పోవడంతో బయట చికిత్స పొందుతున్నారు. వైద్యలు కూడా ఇరుకు గదుల్లో సేవలు అందిస్తు న్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా వంటి వైరల్ జ్వరాలతో రోగులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గదులు సౌకర్యం చాలక వైద్యలు, సిబ్బంది, రోగులు గత 6 సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది, మందులు ఉన్నప్పటికీ గదులు కొరత వల్ల వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారు.


వరండాలో చికిత్స పొందుతున్న రోగులు


మధ్యలో నిలిచిపోయిన ఆస్పత్రి నిర్మాణం

మూలకు చేరిన సామగ్రి

ఆస్పత్రి భవనం పూర్తి కాకముందే ఆస్పత్రికి కావాల్సిన బెడ్లు, మంచాలు, చిన్న పిల్లల చికిత్స కోసం పరికరాలను ప్రభుత్వం మంజూరు చేసి ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే వాటిని వినియోగించడానికి గదులు లేక అలాగే వదిలేశారు. దీంతో అవి వినియోగించకముందే మూలకు చేరాయి. ఎక్షరే ప్లాంట్ ఉన్నా గది సౌకర్యం లేక వినియోగంలోకి రాలేదు. ఇప్పటికైనా సామాజిక ఆసుపత్రి అదనపు గదుల నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు.


వేతనదారులతో మాట్లాడుతున్న డిపిఒ

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

ప్రజాశక్తి- డెంకాడ

గ్రామాల్లో ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎ.మోహనరావు, జిల్లా కోఆర్డినేటర్ బిఎస్‌కె పట్నాయక్ అన్నారు. మండలంలోని పినతాడివాడ, గునుపూరు గ్రామాలను వారు శుక్రవారం సందర్శించారు. పినతాడివాడలో ప్రజలకు తడి పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని, ఐవిఆర్‌ఎస్ కాల్స్‌పై అవగాహన కల్పించారు. డెంకాడ సచివాలయం సందర్శించి సచివాలయ సిబ్బందిని రివ్యూ చేశారు. అనంతరం ఎస్‌డబ్ల్యుపి షెడ్‌లను పరిశీలించి షెడ్ చుట్టూ లెవెలింగ్, వర్మీ తయారీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పినతాడివాడ, గుణుపూరు సర్పంచులు, డిపిఆర్‌ఎస్ నుంచి ఎఫ్‌టిసి చంద్రకళ, పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -చీపురుపల్లి

గరివిడి మండలం డమ్మెద గ్రామం వద్ద స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు శుక్రవారం తోటపల్లి కాలువ పనులను ప్రారంభించారు. అనంతరం చీపురుపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతికి అగ్రస్థానం కల్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అమరావతి అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి అవాకులు


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా

చవాకులు పేలుతున్నారన్నారు. జరుగుతున్న అభివృద్ధికి అడ్డుపడకుండా ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి తాగునీటి సమస్యలు, రెవెన్యూ సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ అందించిన అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ అధికారులు ఎక్కడా అలసత్వం వహించకుండా తక్షణమే సమస్యల పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు. ప్రజా దర్బార్‌లో వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రౌతు కామనాయుడు, గరివిడి మండల నాయకులు పైల బలరాం, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు పాల్గొన్నారు.

కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

లేబర్ కోర్టు తీర్పు ప్రకారం రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించాలని బిజెపి నాయకులు మైపాడ ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బిజెపి ఆధ్వర్యంలో రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యుటీ చెల్లించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మైపాడ ప్రసాద్ మాట్లాడుతూ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆదేశాలు మేరకు గ్రాట్యుటీ ఇప్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా నెల్లిమర్ల జ్యూట్ మిల్ యాజమాన్యం గ్రాట్యుటీ చెల్లించాలని కోరుతూ 20 మంది కార్మికులు జిల్లా ఎసిఎల్‌ని ఆశ్రయించగా ఇందులో 10 మందికి గ్రాట్యుటీ చెల్లించాలని ఆదేశించినట్లు చెప్పారు. కేసు వేసిన వారిలో ఇప్పటికే ఇద్దరు కార్మికులు చనిపోయారని చెప్పారు. 2023 సంవత్సరంలో గ్రాట్యూటీ చెల్లింపులు చేయాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినా ఇంతవరకూ అతీగతి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా లేబర్ కోర్టు తీర్పు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చెప్పినా అధికారం యంత్రాంగం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే గ్రాట్యూటీ చెల్లింపులు చేయకపోతే జ్యూట్ యాజమాన్యం భూములు ఆక్రమించుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బూర్లే శ్రీధర్, చందక గోవింద, రిటైర్డ్ కార్మికులు మజ్జి అప్పారావు, బి. అప్పల నరసమ్మ, పతివాడ అప్పడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- రాజాం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీ అన్నారు. శుక్రవారం గురవాం పంచాయతీ పరశురాంపేట గ్రామంలో రూ.70 లక్షలతో మంజూరైన బిటీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి సాగు, తాగునీరు అందిస్తున్నామని, సూపర్ సిక్స్ హామీ మేరకు ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిందని, ఈ ఐదేళ్లలో నియోజకవర్గంను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అనంతరం డోలాపేట టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి, పలు గ్రామల నుండి వచ్చిన రెవెన్యూ సమస్యలపై వినతలను స్వీకరించి త్వరలోనే


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాక్ ఉగ్రదాడులను తిప్పి కొట్టిన భారత్ ఆర్మీ, రక్షణ దళాన్ని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో గురవాన నారాయణరావు, నంది సూర్య ప్రకాశరావు, కిమిడి అశోక్ కుమార్, దుప్పలపూడి శ్రీను, బవిరి శ్రీను, జనసేన నాయకులు యుపి రాజు, గెడ్డపు నీలకంఠం, నాగరాజు, బిజెపి నేతలు కోటగిరి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మూడేళ్లుగా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో రాకపోకలకు కష్టంగా మారింది. ఆకులకట్ట నుంచి కోటిపల్లి, వాడాడ, జీకేఆర్‌పురం, పినపంకి మీదుగా బొబ్బిలి వెళ్లే రహదారులు చినుకు పడితే చెరువులను తలపించేలా అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లన్నీ గుంతలుగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఎత్తుపల్లాలుగా మారిన రోడ్లలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. మండల కేంద్రానికి చేరాలంటే నరకయాతన పడుతున్నామని, రోడ్లు అన్నీ గుంతలమయం అయ్యాయని ఎప్పుడు ఏం జరుగుతుందో భయంతో వాహనాలు నడుపుకోవాల్సి వస్తుంది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పినపంకి, ఆకులకట్ట గ్రామాల మధ్య ఉన్న రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఈ రోడ్డు పై ప్రయాణించాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుంది. దీంతో చేసేదేమీ లేక చుట్టూ తిరిగి ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఇటీవలే కురిసిన వర్షానికి రోడ్డు గుంతలమయమై చెరువులు తలపించే విధంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లన్నీ మరమ్మతులు చేసే విధంగా చూడాలని మండల ప్రజలు వాహనదారులు కోరుతున్నారు. కనీసం గుంతలైనా పూడ్చాలని వేడుకుంటున్నారు.


చెరువును తలపిస్తున్న అంతర్గత రహదారి

అభివృద్ధి విషయంలో వెనుకాడేది లేదు

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ● మండల పరిషత్ సమావేశం భవనం ప్రారంభం

ప్రజాశక్తి - జామి

అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసే ప్రశక్తే లేదని, ప్రతి చిన్న అవకాశాన్ని అభివృద్ధికే వినియోగిస్తామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జామి మండల పరిషత్ నూతన సమావేశం భవనాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి ఆయన ప్రారంఇంచారు. అనంతరం ఎంపిపి సబ్బవరపు అరుణ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందరంగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, నూతన సమావేశం భవనానికి ఏసి సదుపాయం ఉండాలని అందుకు జిల్లా పరిషత్ నుంచి కొంత నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దేశంలో యుద్ధ వాతావరనం నెలకొన్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. సభలో చింతాడ సర్పంచ్ సుబ్రహ్మణ్యం మెట్ల


సమావేశ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే

నియామకంలో జాప్యం, అపరాలు పంట బీమా విషయాలను లేవనేత్తారు. ఈ కార్యక్రంలో జెడ్‌పిటిసి గొర్లె సరయు, వైసిపి మండల కన్వీనర్ జి. రవికుమార్, మండల అధికార బృందం, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై ధర్నా

ప్రజాశక్తి - భోగాపురం



ధర్నా చేస్తున్న జనసేన నాయకులు

పాఠశాల స్థలం ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని కూటమిలోని అధికార పార్టీకి చెందిన జనసేన నాయకులు స్థానికులతో కలిసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంతోపాటు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు బొల్లు త్రినాథ్, మాత నవీన్ మాట్లాడుతూ భోగాపురం గ్రామంలోని పెద హరిజన పేట పాఠశాల స్థలం ఆక్రమణకు గురైందని స్థానిక తహశీల్దార్ కార్యాలయంతో పాటు మండల పరిషత్ అధికారులతో పాటు గ్రీవెన్స్ సెల్‌లో పెద్ద హరిజన పేటకు చెందిన వారు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు కనీసం స్పందించలేదని అన్నారు. అంతేకాక పాఠశాలకు సంబంధించిన ఎటువంటి రికార్డ్స్ లేనందున మేమేం చేయలేమని చెబుతున్నారని అన్నారు. ఈ పాఠశాల స్థలాన్ని ఒక ఉద్యోగతో పాటు కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుని ఇల్లు నిర్మాణాలు చేపట్టినప్పటికీ పట్టించుకోలేదని అన్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో స్థానికలతో కలిసి ధర్నా చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వీరు డిమాండ్ చేశారు. లేదంటే మున్ముందు ఇంకా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.

'జగదేకవీరుడు అతిలోకసుందరి' రీ రిలీజ్ హంగామా

ప్రజాశక్తి.-విజయనగరం టౌన్

పద్మవిభూషణ్, డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి, అందాల తార శ్రీదేవి నటించిన 'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమా రిలీజ్ అయ్యి 35 సంవత్సరాలు పూర్తి చేసుకుని మళ్లీ శుక్రవారం రీ రిలీజ్ అయిన సందర్భంగా మెగా అభిమానులు ఎన్‌సిఎస్ థియేటర్ వద్ద శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జనసేన నాయకులు గురాన అయ్యలు , థియేటర్ ఎమ్‌డి నారాయణం శ్రీనివాస్ , థియేటర్ మేనేజర్ ఫిల్మ్ శ్రీను, వ్యాపారవేత్త గోవింద్ చేతులమీదుగా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కేకట్ కట్ చేసి, థియేటర్ స్టాఫ్ కు గొడుగులు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత గురాన అయ్యలు మాట్లాడుతూ టాలీవుడ్ ఎవర్ గ్రీన్ క్లాసిక్స్‌లో జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమా ఒకటి అన్నారు..1990లో వచ్చిన ఈ సినిమా అప్పట్లో సంచలనాలకు మారు పేరైందన్నారు. చిరంజీవి యువత అధ్యక్షులు అంజనీపుత్ర చిరంజీవి వార్కర్స్ క్లబ్ వ్యవస్థాపకులు త్యాడ రామకృష్ణారావు(బాలు) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత ప్రతినిధులు, జనసేన యువనాయకులు పిడుగు సతీష్, కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, లోపింటి కళ్యాణ్, ముదిలి శ్రీనివాస్,ఎంటి రాజేష్,లంకపట్నం కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


తప్పించుకు తిరుగుతున్న నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- శృంగవరపు కోట

మండలంలోని చామలపల్లి గ్రామంలో తొత్తడి ప్రసాదు అనే వ్యక్తిని ఈనెల 7వ తేదీ బుధవారం సాయంత్రం కత్తితో నరికి చంపి తప్పించుకొని తిరుగుతున్న నడుపురి మురళి అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసామని సిఐ, వి.నారాయణమూర్తి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. చామలపల్లి గ్రామంలో తన తమ్ముడు తొత్తడి ప్రసాద్‌ను అదే గ్రామానికి చెందిన నడుపురి మురళి అనే వ్యక్తి కత్తితో మెడపై నరికి చంపాడని తొత్తడి బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై చామలపల్లి గ్రామం వెళ్ళి దర్యాప్తు చేయగా ముద్దాయి హత్య చేసిన తరువాత కత్తి పట్టుకుని అతని మోటార్ సైకిల్ పై పారిపోయాడని గుర్తించాం. అప్పటి నుండి ముద్దాయి కోసం గాలింపు చేస్తుండగా ముద్దాయి అతని మోటార్ సైకిల్ పై పారిపోతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మండలంలోని పోతనపల్లి జంక్షన్ వద్ద కాపుకాచి నిందితుడిని అదుపులోనికి తెసుకుని అతని వద్ద నుండి హత్య చేయడాని ఉపయోగించిన కత్తి, మోటార్ సైకిల్‌ని మధ్యావ్యర్థుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నాం. ముద్దాయిని రిమాండ్‌కు తరలించాం. ఇప్పటి వరకు జరిపిన ప్రాథమిక దర్యాప్తులో ముద్దాయి భార్యకు మృతునితో అక్రమసంబంధం ఉందనే అనుమానంతో ముద్దాయి కత్తితో మృతుడు మెడపై నరికి చంపినట్లు తెలిపాడని సిఐ అన్నారు.

దగ్ధమైన జ్యూట్‌ను తొలగించరా?

ప్రజాశక్తి- డెంకాడ


రోడ్డుపై దట్టంగా వ్యాపిస్తున్న పొగ

గత వారంలో నాతవలస టోల్ గేట్ వద్ద లారీ దగ్ధమై డ్రైవర్ సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న జ్యూట్ బెయిల్స్ మొత్తం దగ్ధమయ్యాయి. వాటిని ఇప్పటికీ రోడ్డు మీద నుంచి తొలగించలేదు. అప్పటి నుంచి అవి కాలుతూనే ఉన్నాయి. దీంతో జాతీయ రహదారి పొగతో నిండిపోతుంది. వాహనదారులకు కళ్ళల్లో పొగ చేరి కళ్ళు మండిపోయి ఎదురుగా రహదారి కనిపించడంలేదని చెబుతున్నారు. దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వెంటనే అధికారులు స్పందించి దగ్ధమైన లారీని బయటకు తొలగించి అందులో ఉన్న జ్యూట్ బెయిల్స్‌ను కూడా తొలగించి మంటలను పూర్తిగా అదుపు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పిహెచ్‌సిలో మాక్ డ్రిల్

ప్రజాశక్తి- డెంకాడ

పోలీసులు, వైద్య సిబ్బంది సయుక్తంగా శుక్రవారం డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. పాకిస్తాన్, భారత్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఏ క్షణంలో అయినా బాంబులు, పాకిస్తానీయులు కుట్ర పూరితంగా అవాంఛనీయ కార్యక్రమాలకు పాల్పిడినప్పుడు ప్రజలు గాయపడినప్పుడు ఏ విధంగా బాధితులను పోలీస్‌ల సహాయంతో ఆసుపత్రికి తరలించాలి, ఆసుపత్రి సిబ్బంది వెంటనే ఏ విధంగా చికిత్స అందించాలి వంటి వాటిని ప్రత్యక్షంగా చేసి చూపించారు. పిహెచ్‌సి వైద్యాధికారి ఎస్.అనూష, కిషోర్ వైద్య పరంగా భాదితులకు వెంటనే ఎలా వైద్యం అందించాలో వివరించారు. తీర ప్రాంతం దగ్గరలో ఉన్నందున అప్రమతంగా ఉండాలని ఒక వేళ పిరంగులు లాంటివి వేసినప్పుడు ప్రజలు నేలపై కూర్చుండి పోవాలని, కూర్చొనే మనం నడిచి వెళ్లాలని డెంకాడ పోలీస్‌లు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టాఫనర్స్ మేరి కుమారి, ల్యాబ్‌టెక్నీషియన్ టి. గోవింద్, కె. దుర్గారావు, పి.హెచ్‌ఎన్ వరలక్ష్మి, వైద్య సిబ్బంది కుమారి, ఎంఎస్‌పి రాణి, సీతారాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక హుండీకి విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా గ్రంథాలయ సేవా సంఘం నిర్వహిస్తున్న పుస్తకహుండీ కార్యక్రమానికి దాతల నుండి విశేష స్పందన లభిస్తుందని సంఘం ఉపాధ్యక్షులు కె.దయానంద్, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ తెలిపారు. జర్నలిస్ట్ దిమిలి అచ్యుతరావు తన ఇంట్లో వున్న వివిధ రకాల పుస్తకాలు ఇతరులకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో తమను సంప్రదించిన మేరకు వారి ఇంటికి వెళ్లి పుస్తకాలను స్వీకరించామని అన్నారు. పుస్తక హుండీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, ఇలా సేకరించిన పుస్తకాలను వివిధ గ్రంథాలయాలకు, విద్యార్థులకు అందజేస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు వేలాది పుస్తకాలను దాతల నుండి సేకరించామని అన్నారు. ప్రతీ ఒక్క పుస్తకం సద్వినియోగమయ్యేలా అవసరమైన వారికి వాటిని అందజేశామని, ప్రతీ ఒక్కరూ తమఇళ్లల్లో చదివి వదిలేసిన పుస్తకాలను పుస్తకహుండీకి అందజేసేందుకు ముందుకు రావాలని కోరారు. సెల్ ఫోన్ ప్రభావంతో అన్ని వయసుల వారు పుస్తక పఠనానికి దూరమవుతున్న నేపథ్యంలో మరలా పుస్తకపఠనంపై ఆశక్తి పెంపొందించేలా, గ్రంథాలయాల వైపు నడిపించేలా సంఘం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.